# 'స్మృతిపథం'

**-యస్.డి.వి. అజీజ్**

"ఏమిటండీ అంత తదేకంగా చదువుతున్నారు" భర్త శ్రీనివాసరావుకు కాఫీ కప్పు అందిస్తూ అంది సుశీల.

"కథ చదువుతున్నానోయ్! చాల ఇంట్రెస్టింగ్‌గా వుంది." కాఫీ తాగుతూనే తాను చదువుతోన్న కథపై దృష్టి నిలిపి చెప్పాడు శ్రీనివాసరావు.

"కథ అంత ఇంట్రెస్టింగ్‌గా వుందా?" అడిగింది సుశీల.

"అవునోయ్! చాలా ఇంట్రెస్టింగ్‌గా వుంది. ఓ రెండు నిముషాలు ఆగు. కథ చదవటం పూర్తిచేసి చెబుతాను."

"మీరు కథ చదవటం పూర్తయ్యేదాక మీ వద్దే నిల్చోవటం నా వల్ల కాదు కాని.. వంటింట్లో పనుంది" అనేసి భర్త తాగిన కాఫీ కప్పును తీసుకెళ్ళిపోయింది సుశీల. కాఫీ కడుపులో పడేసరికి హుషారు పుట్టుకొచ్చింది శ్రీనివాసరావుకు. ఆ హుషారుతోనే కథ చదవటం పూర్తిచేసి స్వగతంగా అనుకొన్నాడు.

"రచయిత చక్కటి ఇతివృత్తం తీసుకొన్నాడు. ముగింపు కూడా చాలా బాగుంది"

హాల్లో నుంచి బయటికి వచ్చి ఓ సిగరెట్ వెలిగించాడు. అతని స్మృతి పథంలో నలభై ఏళ్ళ నాటి ఓ జ్ఞాపకం. ఆ జ్ఞాపకం చుట్టే అతని ఆలోచనలు తిరుగాడాయి. కాసేపటి తర్వాత రచయితను అభినందిస్తూ ఉత్తరం వ్రాయాలనిపించింది. అలా అనిపించిన వెంటనే అయిపోవచ్చని సిగరెట్ పీకను దూరంగా విసిరి లోపలికి వచ్చి, కలం కాగితం తీసుకొని ఉత్తరం వ్రాయటం ప్రారంభించాడు. ఓ అరగంటకు ఉత్తరం వ్రాయటం పూర్తయ్యింది. పూర్తయిన ఉత్తరాన్ని ఓ మారు చదువుకొని, కథతో పాటు అచ్చయిన రచయిత చిరునామాను తన ఉత్తరం తాలూకు కవర్‌పై వ్రాసి చిన్నగా నిట్టూర్పు వొదిలాడు. ఆ నిట్టూర్పులో ఆనందముంది.

❖ ❖ ❖

ఓ పది రోజులు గడిచాయి.

కథ తాలూకు రచయిత నుంచి శ్రీనివాసరావుకు తిరుగు సమాధానం వచ్చింది.

శ్రీనివాసరావుగార్కి,

మీ ఉత్తరం చదివాను. నలభై ఏళ్ళ క్రితంనాటి మీ ప్రేమ వ్యవహారం గురించి వ్రాశారు. నా కథలో ఓ రిటైర్డ్ పర్సన్ ఒకప్పుడు తాను ప్రేమించిన వ్యక్తిని చూడాలన్న ఆరాటం కొద్దీ అనేక ఇబ్బందులు పడి, చివరికి ఆమెను చూసి తృప్తిచెందుతాడు. మీకు కూడా నా కథ చదివాక, నలభై ఏళ్ళ క్రితం ప్రేమించిన మీ ప్రేయసిని చూడాలని వుంది అని వ్రాశారు. అవకాశం వుంటే, ఆమె గురించి ఆరాతీసి కలిసే ప్రయత్నం చేయండి! ఐ విష్ యూ ఆల్ ది బెస్ట్.

ఇట్లు

**రమణమూర్తి**

రచయిత ఉత్తరం చదివిన శ్రీనివాసరావుకు ఎలాగయినా నలభై ఏళ్ళ క్రితం తాను ప్రేమించిన సుమిత్రను చూడాలని మనసులో గట్టిగా తీర్మానించుకొన్నాడు. మెల్లిగా ఆమె గురించి వాకబు ప్రారంభించి, ఓ నెల లోపు ఆమె ఎక్కడుంటున్నదీ తెలుసుకొన్నాడు.

❖ ❖ ❖

తాను సేకరించిన సమాచారం ఆధారంగా.. ఓ ఇంటిముందు ఆటో దిగాడు శ్రీనివాసరావు. గేటు మూసి వుంది. గేటు తెరచుకొని లోపలికి అడుగు పెట్టాడు. తలుపు తెరిచే వుంది. తలుపుకు కట్టిన కర్టన్ గాలికి అటు ఇటు కదలాడుతూ వుంది.

శ్రీనివాసరావు మనసులో కొద్దిపాటి అలజడి!

'ఏమైనా అనుకొంటుందా?' అన్న సంకోచం.

'ఇంత దూరం వచ్చాక, సంకోచం దేనికి?' మనసులోని అలజడి తగ్గించుకొంటూ కాలింగ్ బెల్ నొక్కాడు.

ఓ నలభై ఏళ్ళ యువకుడు బయటికి వచ్చాడు.

## నిజాయితీ!

కొత్త సంవత్సరం
హేపీ న్యూ ఇయర్
గ్రీటింగులు చెప్పుకోవడం
ఆనవాయితీ! సాంప్రదాయం!!

ప్రతి సంవత్సరం
కనుమరుగవుతూ
హేపీ కన్పించకపోవడం
నిజాయితీ! మానవ సంబంధం!!

**-గుడిమెట్ల గోపాలకృష్ణ**

శ్రీనివాసరావు వంక ఎగాదిగా చూస్తూ అడిగాడతను.

"ఎవరండీ మీరు?"

"నా పేరు శ్రీనివాసరావంటారు. సుమిత్రగారి కోసం వచ్చాను. వారిని కాస్త పిలుస్తారా?"

"రండి లోపలికి!" ఆహ్వానించాడు ఆ యువకుడు. శ్రీనివాసరావును కుర్చీలో ఆశీనుడ్ని చేశాక చెప్పాడు.

"సుమిత్రగారు.. మా అమ్మగారు. ఆమె చనిపోయి రెండేళ్ళవుతోంది"

అతను చెప్పిన మాటలకు షాకయ్యాడు శ్రీనివాసరావు.

"ఎలా చనిపోయింది బాబూ?"

"క్యాన్సర్ వల్ల"

"మరి మీ నాన్న గారు?"

"ఆమెకంటే ముందే అయిదేళ్ళ క్రితం ట్రైన్ యాక్సిడెంట్‌లో చనిపోయాడు."

"మీరెంతమంది?"

"ముగ్గురం. నా కంటే పెద్దవాళ్ళు ఇద్దరు అక్కలు. నేను మూడోవాడ్ని. పెద్దక్కయ్య అమెరికాలో వుంటోంది. రెండో అక్కయ్య ఢిల్లీలో వుంది. నేను ఇక్కడ వుంటున్నాను. నాకీ అబ్బాయి. నా వైఫ్, నేనూ కూడా ఉద్యోగులమే. ఆమె ఇందాకే పిల్లవాడ్ని తీసుకొని స్కూల్ కెళ్ళింది. వాడ్ని అక్కడ దింపేసి ఆఫీసుకెళ్తుంది. నేను కూడా వెళ్దామనుకొంటుండగా మీరొచ్చారు."

శ్రీనివాసరావు నిట్టూర్చాడు.

"ఇంతకూ మీరు ఎవరి తాలుకో తెలుసుకోవచ్చా?"

"మీ అమ్మగారికి నాకూ ఎలాంటి బంధుత్వం లేదు. నేనూ మీ అమ్మగారు ఒకే కాలేజీలో చదువుకున్నాం! వేరే పనుండి ఈ వూరొచ్చాను. మీ అమ్మగారు ఇక్కడే వున్నారన్న విషయం తెలిసి ఈ వూరొచ్చాను. మీ అమ్మగారు ఇక్కడే వున్నారన్న విషయం గురించి నాతో చెప్పిన వాళ్ళకు, ఆమె చనిపోయిందని తెలిసినట్టుగా లేదు."

"మీ గురించి తెలుసుకోవచ్చా?"

"నా గురించి చెప్పడానికేముంది బాబూ? ఇద్దరబ్బాయిలు. ఇద్దరూ ఉద్యోగస్తులే! ఇద్దరికీ పెళ్ళిళ్ళు అయిపోయాయి. నేను కూడా ఓ ఎంప్లాయీనే! ఈ మధ్యే రిటైర్ అయ్యాను."

ఇద్దరి మధ్య కాసేపు మౌనం.

"బాబూ! మీ అమ్మగారి ఫోటో ఒకటి వుంటే ఇస్తావా?"

"ఫోటో అంటే టైం పడుతుంది. మీ చిరునామా ఇవ్వండి! పంపుతాను"

చిరునామా వ్రాసిచ్చాడు శ్రీనివాసరావు.

"ఓ ఫోటోను ఎన్‌లార్జ్ చేసి ఫ్రేమ్ కట్టించి నా బెడ్ రూంలో వుంచాను. చూస్తారా?" అడగకుండానే చెప్పాడతను.

"తప్పకుండా!" అంటూ అతనితో పాటు బెడ్‌రూంలో కెళ్ళి గోడకు తగిలించి దండ వేసి వున్న సుమిత్ర ఫోటోను చూశాడు. మనసులో ఏదో తెలియని బాధ. కనుకొలకుల్లో కన్నీరు. గుండె బరువెక్కింది.

ఇద్దరూ తిరిగి హాల్లోకి వచ్చారు.

"బాబూ! నువ్వేమనుకోకపోతే, ఓ మాట అడుగుతాను"

"అడగండి!"

"మీ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు ఎలా నిర్వహిస్తారు?"

"మేము ఖననం చేస్తాము."

"ఖననం చేసిన మీ అమ్మకు, మీ నాన్నగారికి సమాధికట్టారా?"

"అనుకున్నాము గాని కుదర్లేదు"

"సరే బాబూ వస్తాను. ఇప్పటికే నా కోసం నీవు చాలా టైం వెచ్చించావు. కృతజ్ఞుడ్ని!"

"నా కంటే పెద్దవారు. అలాంటి మాటలు ఎందుకండీ! మీరు అంతగా ఇల్లు వెతుక్కొంటూ వచ్చారు. అలాంటప్పుడు మీ కోసం కొంత సమయం కేటాయించడటంలో తప్పులేదు."

"వస్తాను బాబూ!"

"మంచిదండి!" అంటూ మెయిన్‌గేటువరకు వచ్చాడు.

సుమిత్ర కొడుకు నుంచి సెలవు పుచ్చుకొని ముందుకు కదిలాడు శ్రీనివాసరావు.

కళ్ళముందు సుమిత్ర రూపం! మరోమారు కనుకొలకుల్లో నీరు!

"నేస్తమా! నా కంటే ముందే వెళ్ళిపోయావా? పెద్దల ఆభిజాత్యం కారణంగా, కులాల పట్టింపు కారణంగా మన ప్రేమ ఫలించి పెళ్ళిదాక వెళ్ళలేదు. ఇద్దరం పెద్దలకు తలవంచి వేరయ్యాము. కొన్నాళ్ళకు నేనూ నువ్వు వెళ్ళిన చోటుకు వస్తాను. అక్కడ నీతో, మీ వారితో కబుర్లు చెబుతూ గడుపుతాను. ఇక్కడిలా, అక్కడ ఎలాంటి ఆభిజాత్యాలూ, ఈర్ష్యాద్వేషాలు, కుల పట్టింపులు, హోదాలు వుండవు. అంతా సమానమే!" అనుకొంటూ భారంగా అడుగులు ముందుకు వేశాడు. ■